సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 20 । జనవరి । 2023



స్థానిక సంస్థలకేనా?
కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు మున్సిపాలిటీలు, పంచాయతీల నిధులు వెచ్చించాలని అధికార యంత్రాంగం ఆదేశించింది.
- 8లో ▸



పక్కాగా యాసంగి లెక్క
యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేస్తున్నారు.
- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.7 /18.7

వాతావరణం
పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. చలితీవ్రత కొనసాగుతుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్ పచ్చి అబద్ధాల కోరు

- ఎంపీ అర్వింద్ ధర్మపురి



సుభాష్‌నగర్ : ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు పచ్చి అబద్ధాల కోరు అని, బూటకపు హామీలు, వాగ్దానాలు చెప్పుకునేందుకే బీఆర్‌ఎస్ పేరుతో దేశమంతా తిరుగుతున్నారని ఎంపీ అర్వింద్ ధర్మపురి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. లిక్కర్ స్కాం వాటాదారులంతా ఒకే వేదికపైకి వచ్చారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. దేశానికి దళితబంధు, ఉచిత కరెంట్ సరఫరా చేస్తానని ఖమ్మం సభలో హాస్యపూరిత వ్యాఖ్యలు చేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో 16 లక్షల దళిత కుటుంబాలు ఉంటే.. ఇప్పటివరకు పది వేల కుటుంబాలకు మాత్రమే దళితబంధు మంజూరు చేశారని, అందులో సగం మందికి కూడా యూనిట్లు చేరలేదని పేర్కొన్నారు. తెలంగాణలో దళితబంధు పూర్తిగా అమల్జేయాలంటే 160 ఏళ్లు అవుతుందన్నారు. ప్రైవేటీకరణ గురించి మాట్లాడుతున్న సీఎం నిజాంషుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరిపించలేదని ప్రశ్నించారు. 30శాతం కమీషన్లు ఇవ్వలేకనే కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం లేదని ఆరోపించారు.

అధికారులకు నోటీసులు జారీ

- ఎన్‌బీఏ అధ్యక్షుడిపై కేసులో హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ బార్ అసోసియేషన్(ఎన్‌బీఏ) అధ్యక్షుడు ఎర్రం గణపతిపై కేసుకు సంబంధించి అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌ను నిలుపుదల చేసింది. తదుపరి విచారణలోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 23కు వాయిదా వేసింది. ఎన్‌బీఏ అధ్యక్షుడు గణపతిపై పది రోజుల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని ఖండిస్తూ, న్యాయం చేయాలంటూ గణపతితో పాటు హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు సీజేను కలసి విజ్ఞప్తి చేశారు. ఒక కేసు విషయంలో నిజామాబాద్ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి అటాచ్‌మెంట్ ఎగ్జిక్యూట్ వారెంట్ నోటీసులు జారీ చేశారని, వీటిని అందించేందుకు కలెక్టరేట్‌కు వెళ్లిన కోర్టు ఉద్యోగి, డిక్రీ హోల్డర్‌తో పాటు తనపై నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసు బనాయించారని గణపతి వివరించారు. దీంతో కేసు నమోదుకు సంబంధించి సుమోటో పిటిషన్‌గా హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన సీఎస్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నిజామాబాద్ కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 23కు వాయిదా వేసింది.

మామ, బావమర్ది వేధిస్తున్నారని..

- సూసైడ్ నోట్ రాసి ఉపాధ్యాయుడి ఆత్మహత్య



శ్రీధర్ (ఫైల్)

మాక్లూర్ : మామ, బావమర్ది వేధిస్తున్నారని సూసైడ్ నోట్ రాసి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బొజ్జ శ్రీధర్(48) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు.. శ్రీధర్ అతని భార్య స్వప్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరికి అమూల్య, ఆకాంక్ష అనే కూతుర్లు ఉన్నారు. పిల్లల చదువు కోసం స్వప్న నిజామాబాద్‌లో ఉంటూ నవీపేట ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తుండగా, శ్రీధర్ కొత్తపల్లిలో ఉండి వ్యవసాయం చూసుకుంటూ నందిపేట మండలం కుద్వాన్‌పూర్ పాఠశాలలో పని చేస్తున్నారు. కాగా బుధవారం రాత్రి శ్రీధర్ ఇంట్లో గడ్డిమందు తాగి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ గురువారం శ్రీధర్ మృతి చెందాడు. తాను ఆత్మహత్య చేసుకోడానికి తన మామ సాంబశివరావు, బావమర్ది కల్యాణ చక్రవర్తి కారణం అని సూసైడ్ నోట్ లభించింది. కాగా అప్పుల బాధ భరించలేక తన కుమారుడు చనిపోయాడని శ్రీధర్ తండ్రి కోటేశ్వర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

అద్దాలు అంతంతే..

- కంటి వెలుగులో దగ్గరి చూపు సమస్య ఉన్నవారికే అద్దాల పంపిణీ
- ఆపరేషన్ అవసరమైన వారి వివరాలు నమోదు చేయని సిబ్బంది
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

కంటివెలుగు కార్యక్రమంలో దగ్గరి చూపు సమస్య ఉన్నవారికి మాత్రమే అద్దాలు ఇచ్చారు. దూరపు చూపు సమస్య ఉన్నవారికి వారం రోజుల్లో అద్దాలు అందిస్తామని అధికారులు చెప్పారు. మోతిబిందు, ఇతర శస్త్రచికిత్సలు అవసరమైనవారి వివరాలు నమోదు చేసుకోకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. జిల్లాలో 8,347 మందికి పరీక్షలు నిర్వహించగా 1,674 మందికి రీడింగ్ అద్దాలు ఇచ్చారు. దూరం చూపు సమస్య ఉన్న 1,255 మంది వివరాలు నమోదు చేసుకున్నారు.



నగరంలో కంటి అద్దాలు తీసుకుంటున్న ప్రజలు



నిజామాబాద్‌లో కంటి పరీక్షలు చేయించుకునేందుకు పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కంటి వెలుగు కార్యక్రమానికి విస్తృత ప్రచారం చేయడంతో జిల్లావ్యాప్తంగా మంచి స్పందన వచ్చింది. అయితే కంటి పరీక్షల కోసం శిబిరానికి వెళ్లిన ప్రజలకు అద్దాల పంపిణీ అరకొరగానే జరిగింది. దగ్గరి చూపు సమస్య ఉన్న వారికి మాత్రమే అద్దాలు ఇచ్చారు. దూరపు చూపు సమస్య ఉన్న వారికి ఇవ్వలేదు. వీరికి వారం రోజుల్లో అందిస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా 2018లో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 50 వేల మందికి ఇప్పటివరకు అద్దాలు అందించకపోవడం గమనార్హం. అప్పుడు కంటి పరీక్షలు, ఆధార్ వివరాల నమోదు సమయంలో పొరపాటు జరగడంతో గందరగోళం నెలకొంది. ఒకరికి కంటి పరీక్షల వివరాలను మరొకరి ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేశారు. దీంతో సదరు అద్దాలు జిల్లా కేంద్రానికి వచ్చినప్పటికీ వాటిని పంపిణీ చేయలేని పరిస్థితి. ఈ అద్దాలను డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే ఉంచి ఇటీవల వెనక్కు పంపినట్లు తెలిసింది. అదేవిధంగా పలువురికి ఇచ్చిన అద్దాలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. నాలుగేళ్లు గడిచినప్పటికీ అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయలేదు. తాజాగా చేస్తున్న పరీక్షల్లో మోతిబిందు, ఇతర శస్త్రచికిత్సలు అవసరమైన వారి వివరాలు నమోదు చేసుకోకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తుండడం గమనార్హం.

తొలిరోజు 8,347 మందికి పరీక్షలు

నిజామాబాద్ సిటీ : జిల్లాలో తొలిరోజు 70 కంటి వెలుగు శిబిరాల్లో 8,347 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 1,674 మందికి దగ్గర చూపు(రీడింగ్ గ్లాస్) అద్దాలు అందజేశారు. దూరం కంటి చూపు సమస్య ఉన్న 1,255 మంది నుంచి ఆర్డర్ తీసుకున్నారు. వీరికి 15 రోజుల్లోపు వారి ఇంటి అడ్రస్‌కు అద్దాలు పంపనున్నారు. శస్త్ర చికిత్స కోసం రిఫర్ చేసేందుకు ఆప్షన్ లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సిబ్బంది సూచించారు.

అద్దాలు తీసుకున్న మంత్రి



నగరంలోని వినాయక నగర్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు 2.0 షార్ట్ విజన్ ఉందని తేలడంతో అద్దాలు తీసుకున్నారు.

18 ఏళ్ల లోపు వారికి నో..



డిచ్‌పల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరంలో కొందరు పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఇందూరి సుదీక్ష అనే ఆరో తరగతి విద్యార్థికి ఆరు నెలలుగా చిన్న అక్షరాలు కన్పించక ఇబ్బంది పడుతోంది. దీనికి తోడు కొద్దిగా తలనొప్పి వేధిస్తోంది. గురువారం గ్రామంలో కంటి పరీక్ష చేయించుకోగా చూపు సమస్యను గుర్తించారు. అయితే 18 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే అద్దాలు పంపిణీ చేయాలని నిబంధనలు ఉండడంతో, ఆమెకు ఇవ్వలేదు. ఇలానే మిగతా విద్యార్థులకు కూడా కళ్లజోళ్లు అందించకపోవడంతో పిల్లలు, వారి తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగారు.

సరైన అద్దాలు ఇవ్వలేదు



మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమంలో కళ్లద్దాలను సక్రమంగా అందజేయలేదు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు రెండు కళ్లలో దృష్టి లోపంలో తేడాలు ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలను ప్రత్యేకంగా తయారు చేసి అందజేశారు. ఆ అద్దాలు పరీక్షలకు భిన్నంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నా. ఈ సారైనా మంచి అద్దాలను అందజేయాలి.

– గంగాధర్, పెర్కిట్, ఆర్మూర్ పట్టణం

దృష్టి లోపాలు దూరం!

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం

నిజామాబాద్ సిటీ : దృష్టి లోపాలను దూరం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కంటి వెలుగు–2 కార్యక్రమాన్ని గురువారం నగరంలోని వినాయక నగర్ న్యూహౌసింగ్ బోర్డు స్త్రీ స్వశక్తి భవన్‌లో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం వెనుక ఎలాంటి రాజకీయం లేదని, ఓట్ల కోణం అసలే కాదని చెప్పారు. తొలి విడతలో జిల్లాలో ఏడు లక్షల మందికి కంటి పరీక్షలు జరిపి, రెండు లక్షల మందికి అద్దాలు పంపిణీ చేశామన్నారు. రెండో విడతలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, అద్దాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 12 లక్షలపైగా మందికి స్క్రీనింగ్ చేసేందుకు 70 బృందాలను ఏర్పాటు చేశామని, వంద రోజుల పాటు ఈ శిబిరాలు అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో కొనసాగుతాయని తెలిపారు. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా మాట్లాడుతూ.. చూపు సమస్యలు లేకుండా చేయడానికే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు అధికారులని సమన్వయం చేసుకొని ప్రజలందరికీ కంటి పరీక్షలు చేయించాలన్నారు. నిజామాబాద్ నగరంలో 13 కేంద్రాల్లో కంటి వెలుగు పరీక్షలు చేనస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రులకు వెళ్లి కంటి పరీక్ష చేయించుకునే వెసులుబాటు లేనివారికి కంటి వెలుగు శిబిరాలు గొప్ప అవకాశంగా నిలుస్తాయని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. వీటిని పూర్తి స్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు–2 కార్యక్రమం ద్వారా జిల్లాలో 12.30 లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు 70 బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారికి 15 నుంచి 20 రోజుల్లోపు వారి ఇళ్లకు వెళ్లి అందజేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్సీ డి రాజేశ్వర్, మేయర్ నీతూ కిరణ్ , మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, కంటి వెలుగు రాష్ట్ర పరిశీలకులు, నోడల్ అధికారి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంయుక్త సంచాలకులు అంబర్ సింగ్ నాయక్, నిజామాబాద్ సీపీ నాగరాజు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, స్థానిక కార్పొరేటర్ ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు.



నగరంలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బిగాల, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

బండి సంజయ్ కంటి పరీక్ష చేయించుకోవాలి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ చూసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు మతిపోయిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్ బీఆర్‌ఎస్‌పై ఏదో ఒక విమర్శ చేయాలనే తప్పా ఆయన మాటల్లో వాస్తవాలు లేవన్నారు. ఖమ్మం బీఆర్‌ఎస్ సభకు వచ్చిన జనం కనిపించకపోతే సంజయ్ కంటివెలుగు ద్వారా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆయన ఆధార్ కార్డు తీసుకునిపోతే రాష్ట్రంలో ఎక్కడైనా కంటి పరీక్ష చేస్తారన్నారు. ఖమ్మం సభ చూసి దేశవ్యాప్తంగా ప్రజలు ఆశ్చర్యపోయారన్నారు. ఇరుకు గల్లీలో పెట్టుకునే ప్రజా సంగ్రామ సభలో ఎంత మంది ఉంటున్నారన్నారు. అసలు బండి సంజయ్‌కు బహిరంగ సభల గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. మీడియా ముందు, చౌరస్తాల్లో మాట్లాడుడు మాత్రమే బండికి తెలుసన్నారు. ఖమ్మం సభకు వచ్చిన జనాన్ని చూసిన ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ సైతం తానింతవరకు ఇంత పెద్ద సభ చూడలేదన్నారని చెప్పారు. కంటి వెలుగు వరల్డ్ లార్జెస్ట్ ఐ స్క్రీన్ టెస్ట్ ప్రోగ్రామన్నారు. ఈ కార్యక్రమం గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కానుందన్నారు.

మిల్లర్లతో కుమ్మక్కై రూ.కోట్లు కొల్లగొట్టారు



కలెక్టర్ ఛాంబర్ వద్ద బైఠాయించిన కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి
- బియ్యం కుంభకోణంపై కలెక్టరేట్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నాయకులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై ప్రజాప్రతినిధులు, అధికారులు రూ.కోట్లు కొల్లగొట్టారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. బియ్యం కుంభకోణంపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ ఛాంబర్ వద్ద బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యే షకీల్‌తో పాటు బియ్యం కుంభకోణంలో జిల్లా అధికారుల పాత్ర సైతం ఉందన్నారు. మూడేళ్లుగా ఎమ్మెల్యే షకీల్, కొందరు బీఆర్‌ఎస్‌కు చెందిన రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకున్నారని ఆరోపించారు. రూ.వందల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌ను అడిగేందుకు వస్తే ఆయన లేరన్నారు. జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ బియ్యం కుంభకోణంలో పాత్రధారులని ఆరోపించారు. ధాన్యం తిరిగి రాబట్టడంలో అలసత్వం చూపిస్తున్న పౌరసరఫరా శాఖ అధికారులు, ప్రైవేటులో అమ్ముకున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు, ఖైసర్, అన్వేష్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, గోపి, విక్కీయాదవ్, వేణురాజ్, భాగ్య, రాజా నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్ అలీ, రామ్‌భూపాల్, కార్పొరేటర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నాటు తుపాకీ పేలి వన్యప్రాణుల వేటగాడు మృతి

- అటవీ ప్రాంతంలో అర్ధరాత్రి ఘటన
- వెంట వెళ్లిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రెండు తుపాకులు స్వాధీనం
- ఘటనపై మృతుడి భార్య అనుమానం



ఘటనా స్థలం వద్ద రావూజీ మృతదేహం



రావూజీ (ఫైల్)

సిరికొండ : సిరికొండ మండలం తూంపల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి నాటు తుపాకీ పేలి వన్యప్రాణుల వేటగాడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సర్దాపూర్ తండా గ్రామ పంచాయతీకి చెందిన బానోతు రాంరెడ్డి, బానోతు రావూజీ వరుసకు సోదరులు అవుతారు. వీరిద్దరు సోమారిపేట గ్రామానికి చెందిన బద్దం ఆశిరెడ్డిని వెంట తీసుకొని అటవీ ప్రాంతంలోనికి వన్యప్రాణులను వేటాడానికి వెళ్లారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రావూజీ చెట్టు పైకి ఎక్కాడు. కింద ఉన్న రాంరెడ్డి నాటు తుపాకీని అందిస్తుండగా చీకట్లో చెట్టు కొమ్మకు తగిలి మిస్‌ఫైర్ అయ్యింది. తుపాకీలోని గుండు చెట్టుపైన ఉన్న రావూజీ గుండెలోకి దూసుకుపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే రాంరెడ్డి, ఆశిరెడ్డి మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. మాచారెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటన జరిగిన స్థలం సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోనిది కావడంతో అక్కడి పోలీసులకు సమాచారం తెలిపారు. దీంతో సిరికొండ ఎస్సై నర్సింలు, ధర్పల్లి సీఐ సైదా సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. రాంరెడ్డి, ఆశిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితులు వన్యప్రాణులను వేటాడటానికి తీసుకెళ్లిన రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. కాగా తన భర్తను చంపి ఉంటారని రావూజీ భార్య సరిత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నిజామాబాద్ డీఎఫ్‌వో వికాస్‌మీనా, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీ శంకర్, సిరికొండ రేంజర్ ఎంపీ నాయక్, సెక్షన్ ఆఫీసర్ గంగారెడ్డి కూడా ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల తండాలకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

మాస్టర్‌ప్లాన్ రద్దు!

- తీర్మానం కోసం నేడు బల్దియా అత్యవసర సమావేశం
- కౌన్సిల్ ప్రపోజల్‌కు విరుద్ధంగా డ్రాఫ్ట్ : చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి

సాక్షి కామారెడ్డి/కామారెడ్డి టౌన్: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ రద్దు చేసి తమకు న్యాయం చేయాలని నెలన్నర రోజులుగా రైతు జేఏసీ, రైతులు, బాధితులు చేస్తున్న ఆందోళనలకు బల్దియా దిగొచ్చింది. ఎట్టకేలకు పాలకవర్గం ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేసేందుకు ముందుకు వచ్చింది. ఇందు కోసం నేడు అత్యవసరంగా నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో తీర్మానించి మాస్టర్‌ప్లాన్ రద్దును ప్రభుత్వానికి పంపనున్నారు.

సర్క్యులర్ విడుదల

2021 మార్చి 27న ప్రభుత్వానికి పంపిన నూతన ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయడానికి అత్యవసర సమావేశాన్ని బల్దియా కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, కమిషనర్ దేవేందర్‌లు సర్క్యులర్ లేఖను విడుదల చేశారు. మాస్లర్‌ప్లాను రద్దు చేస్తూ నేడు కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. రద్దు కోరుతూ తీర్మానాన్ని డీడీఎఫ్ ఫోరం ఢిల్లీ, పట్టణ ప్రణాళిక జాయింట్ డైరెక్టర్, డీటీసీపీలకు పంపనున్నారు. ఇందుకోసం అత్యవసర సమావేశంలో ఓటింగ్ ద్వారా 49 కౌన్సిలర్‌లతో పాటు కో–ఆప్షన్ మెంబర్లు రద్దు కోసం తీర్మానం చేయనున్నారు.

వాయిదా ప్రకటన

నేడు నిర్వహించాల్సి ఉన్న ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడిని వాయిదా వేస్తున్నట్లు రైతు జేఏసీ ప్రతినిధులు గురువారం సాయంత్రం ప్రకటించారు. చైర్‌పర్సన్, కమిషనర్‌లు మాస్టర్‌ప్లాన్ రద్దు ప్రకటన చేయడంతో ముట్టడి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే అడ్లూర్‌లో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మేం పంపిన ప్లాన్ కాదది : చైర్‌పర్సన్



తాము 2021 మార్చి 27వ తేదిన తయారు చేసిన మాస్టర్‌ప్లాన్‌ను కాకుండా దానికి వ్యతిరేకంగా డీడీఎఫ్ సంస్థ మరో ముసాయిదా ప్లాన్‌ను పంపించిందని వీటిలో చాలా మార్పులు ఉన్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందన్నారు. ముసాయిదా మాస్టర్ రద్దు కోసం నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. నెలన్నర రోజులు రైతులు ఆందోళన చేయడం బాధాకరమన్నారు. రైతులు శాంతించాలని కోరారు. రైతులను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించాయన్నారు.

క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ యూజీ ఒకటవ, మూడవ ,4వ సెమిస్టర్ ఫీజు చెల్లించుటకు గడువు తేదీని పొడిగించినట్లు రీజినల్ కోఆర్డినేటర్ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజులు చెల్లించాలన్నారు అలాగే ఈ ఏడాది ప్రవేశం పొందిన సైన్స్ గ్రూప్ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఈనెల 24నుంచి కళాశాల ప్రాంగణంలో ప్రారంభమవుతాయన్నారు. ప్రయోగ తరగతులకు 70% హాజరు లేని వారిని ప్రయోగ పరీక్షలకు అనుమతించబోమని తెలిపారు. విద్యార్థులందరూ తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు.

ఖేలో ఇండియా సెంటర్‌లో ప్రవేశానికి ఎంపికలు

కామారెడ్డి అర్బన్: ఇండియన్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా సెంటర్‌లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశానికి క్రీడాకారుల ఎంపికలు ఈనెల 31, ఫిబ్రవరి 1న నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జీఎంసీ బాలయోగి స్టేడియంలో అర్చరీ, అథ్లెటిక్స్, హాకీ, కబడ్డీ ఎంపికలుంటాయన్నారు. అలాగే సరూర్‌నగర్, ఎల్‌బీ నగర్ స్టేడియాల్లో జిమ్నాస్టిక్ ఎంపికలుంటాయన్నారు. 12నుంచి 18ఏళ్ల లోపు బాలబాలికలు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి వివరించారు.

డిగ్రీ పరీక్షల్లో 23మంది డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల్లో డిబార్ల పర్వం కొనసాగుతోంది. గురువారం నాటికి 23 మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టరు బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 3433 మంది విద్యార్థులకు గానూ 3250 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టరు రెగ్యులర్, ఆరవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలలో 10,463 మంది విద్యార్థులకు గానూ 9673 మంది హాజరయ్యారన్నారు. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్‌కు గురైనట్లు ఆమె తెలిపారు.

సీనియర్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలి



సుభాష్‌నగర్: సీనియర్ జర్నలిస్టులకు ఫ్రీలాన్స్ అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను సరళతరం చేయాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ.. త్వరలో అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న కార్డులకు ఆమోదం తెలపాలన్నారు. జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్‌లో కంటి వెలుగు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేయాలన్నారు. వీరి డిమాండ్లపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జమాల్‌పూర్ గణేష్, నాయకులు రాజేష్, శ్రీనివాస్, సుభాష్, శ్రీకాంత్, దివాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

కంటివెలుగు నిర్వహణ స్థానిక సంస్థలకేనా?

- మొదటి విడతలో వైద్య శాఖ నుంచి నిధులను కేటాయించిన ప్రభుత్వం
- రెండోవిడత నిర్వహణపై స్పష్టత కరువు
- ప్రస్తుతం జీపీలు, మున్సిపాలిటీలే భరించాలని అధికారుల ఆదేశం



మోర్తాడ్‌లో కంటి వెలుగు శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమానికి నిధుల కేటాయింపుపై స్పష్టత కరువైంది. ప్రస్తుతం కార్యక్రమ నిర్వహణకు పంచాయతీలు, మున్సిపాలిటీలే నిధులను వెచ్చించాలని అధికార యంత్రాంగం ఆదేశించింది. గతంలో కంటి వెలుగు వైద్య శిబిరానికి అవసరమైన టెంటు, కుర్చీలు, ఇతర సామాగ్రి కోసం రోజుకు రూ.వెయ్యి చొప్పున, వైద్య సిబ్బంది భోజనం కోసం రూ.1,500ల చొప్పున వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈసారి మాత్రం నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 70బృందాలు..

ఉన్నతాధికారులు జిల్లాలో 70 బృందాలతో మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలు, పట్టణాలలోని వార్డులలో కంటి పరీక్షలను ఆరంభించారు. మూడు రోజుల పాటు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలే అన్ని రకాల ఖర్చులను భరించాలని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నిధుల వినియోగంపై సూచనలు చేస్తామని అధికార యంత్రాంగం వెల్లడించింది. మండల కేంద్రాల్లో నెలకంటే ఎక్కువ రోజుల పాటు శిబిరాలను నిర్వహించే అవకాశం ఉంది. గ్రామాలు, పట్టణాల్లోను జనాభా ఆధారంగా వారం రోజుల నుంచి పది రోజుల వరకు శిబిరాలను నిర్వహించనున్నారు.

వేధిస్తోన్న నిధుల కొరత..

ఇప్పటికే పంచాయతీలకు నిధుల కొరత పట్టి పీడిస్తుండటంతో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ తమకు భారం అవుతుందని సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. శిబిరం నిర్వహణకు కొంత, భోజనాలు ఇతర సదుపాయాల కోసం అధికంగా ఖర్చులు చేయాల్సి ఉంటుందని పంచాయతీల ఉద్యోగులు చెబుతున్నారు. కంటి పరీక్షల శిబిరాలు వంద రోజుల పాటు కొనసాగనున్నాయి. మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాలకైతే శిబిరం ముగిసేవరకు రూ.25వేల నుంచి రూ.80వేల వరకు నిధులు అవసరం కానుంది. తక్కువ రోజుల పాటు శిబిరాలు కొనసాగే గ్రామాలకు పెద్దగా భారం ఏర్పడదని ఎక్కువ రోజులు శిబిరాలను నిర్వహించిన చోటనే నిధులకు ఇబ్బంది కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కంటి వెలుగు రెండో విడత శిబిరానికి నిధులను కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

సెమినార్లను సద్వినియోగం చేసుకోండి



సౌత్‌క్యాంపస్ విద్యార్థులతో వీసీ రవీందర్‌గుప్తా, ఇంగ్లాండ్ ప్రొఫెసర్ మన్నె ఉపేందర్

భిక్కనూరు: ప్రతి విద్యార్థి తమకు సంబంధించిన సెమినార్లను సద్వినియోగం చేసుకోవాలని ఇంగ్లాండ్ అలభామ యునివర్సిటీ ప్రొఫెసర్ మన్నె ఉపేందర్ అన్నారు. మండలంలోని తెయూ సౌత్ క్యాంపస్‌లో గురువారం ఆయన జువాలజీ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి నూతన విషయాలపై అవగాహన, పరిశోధనలపై ఆసక్తి పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతులను తాను ఆన్‌లైన్‌ద్వారా తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తెయూ వీసీ రవీందర్‌గుప్తా ఆయనను సన్మానించారు. రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వన్‌వేలో కార్ల పార్కింగ్



ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఆస్పత్రులకు వెళ్లడానికి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఉద్దేశంతో వన్‌వే ఏర్పాటు చేశారు. ఈ వన్‌వేలో బీఎస్ఎన్ఎల్ ఆఫీసు నుంచి రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు ఉన్న రోడ్డుపై మూడు చోట్ల బారికేడ్లను పెట్టారు. బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుంచి వచ్చిన వారు మళ్లీ అటువైపు వెళ్లకుండా ట్రాఫిక్ పోలీసులను మూడు చోట్ల షిఫ్ట్‌ల వారీగా ఉంచారు. ట్రాఫిక్ సిబ్బంది మాత్రం అక్కడ కొంత మందికి వాహనాల్లో వెళ్లడానికి అనుమతించి మరి కొంత మందికి అనుమతి ఇవ్వడం లేదు. దీంతో ట్రాఫిక్ సిబ్బందితో కొన్ని సందర్భాల్లో వాహనదారులు వాగ్వివాదానికి దిగిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు రోడ్డుపైనే కార్లను, వాహనాలను పార్కింగ్ చేస్తున్నా ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోకపోవడం శోచనీయం. అధికారులు ట్రాఫిక్ రూల్స్‌ను అందరికీ ఒకే విధంగా అమలు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రాజకీయ రిజర్వేషన్ దక్కేంతవరకు పోరాటం

- బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్



మాట్లాడుతున్న బీవీహెచ్‌పీఎస్ ప్రతినిధులు

డిచ్‌పల్లి: చట్టసభల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ దక్కేంతవరకు నిజామాబాద్ జిల్లా నుంచే వికలాంగుల రాజ్యాధికార సాధన పోరాటం కొనసాగుతుందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి(బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ పేర్కొన్నారు. గురువారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలో నిర్వహించిన బీవీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చట్టసభల్లో దివ్యాంగుల రాజకీయ రిజర్వేషన్‌పై అన్ని రాజకీయ పార్టీలు వాటి వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 75 ఏళ్ల నుంచి రాజ్యాధికారానికి దూరమైన దివ్యాంగులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని సీట్లు ఇస్తారో ప్రధాన పార్టీల అధ్యక్షులు స్పష్టం చేయాలన్నారు. భారతావనిలో రాజ్యాధికారానికి దూరమైన ఏకైక సామాజిక వర్గం ఒక్క దివ్యాంగుల సామాజిక వర్గమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు మాదిరిగానే దివ్యాంగుల బంధు పథకాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీవీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతం జ్ఞానేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాయికుడు పోశెట్టి, మహేష్, బరిడే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

లారీ చోరీ కేసులో అరెస్ట్

కామారెడ్డి క్రైం: చోరీ చేసి లారీని అమ్ముకుందామని భావించిన ఓ నిందితుడిని దేవునిపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా.. పట్టణానికి చెందిన చౌకీ ఆనంద్ సిరిసిల్ల రోడ్ ప్రాంతంలో ఇటుకబట్టీ నిర్వహిస్తున్నాడు. అతని వద్ద గతంలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా లక్క గ్రామానికి చెందిన బోయవారి ప్రకాష్ లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. గతేడాది ఇక్కడ పని మానేసి ఇతర ప్రాంతానికి వెళ్లాడు. రెండు నెలల క్రితం తిరిగివచ్చి మళ్లీ పనిలో చేరాడు. వచ్చే జీతం సరిపోకపోవడంతో తాను డ్రైవింగ్ చేసే లారీని దొంగిలించి అమ్ముకుందామని ఎత్తుగడ వేశాడు. ఈనెల 13న అర్ధరాత్రి లారీని చోరీ చేశాడు. దీంతో లారీ యజమాని ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. 14న టేక్రియాల్ ప్రాంతంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. గురువారం టేక్రియాల్ శివారులో ప్రకాష్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకోరా గ్రామ శివారులో కోడిపందాల స్థావరంపై వర్ని పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పందాలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6740 నగదును, 12 కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

దివ్యాంగుల్లో మనోధైర్యం నింపాలి

- డీఈవో రాజు
- కామారెడ్డిలో టీఎల్ఎం కిట్స్ పంపిణీ

కామారెడ్డి: దివ్యాంగులలో మనోధైర్యం నింపి వాళ్లలో జీవితంపై సానుకూల దృక్పథం అలవర్చుకునేలా కృషి చేయాలని డీఈవో రాజు అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం జాతీయ మేధో దివ్యాంగ సాధికార సంస్థ(ఎన్ఐఈపీఐడీ) ఆధ్వర్యంలో 57మంది దివ్యాంగ విద్యార్థులకు టీఎల్ఎం కిట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కొక్క కిట్ విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని, వీటిని విద్యార్థులకు బోధనలో సక్రమంగా వినియోగించాలని విలీన విద్య రిసోర్స్ పర్సన్‌లను, తల్లిదండ్రులను కోరారు. కిట్ల వినియోగంపై శిక్షణ అందించారు. సంస్థ ప్రతినిధి హృషికేష, విలీన విద్య సమన్వయ కర్త శ్రీపతి, ఎంఈవో ఎల్లయ్య, అధికారులు వేణుగోపాల్‌శర్మ, మనోహర్, ఎన్ఐఈపీఐడీ ప్రతినిధులు సౌమ్య బజాజ్, సంతోష్, నర్సింలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజు

వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే సురేందర్ ఆగ్రహం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కంటి వెలుగు ప్రారంభ కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. బాలాజీ నగర్ తండాకు చెందిన దేశెట్టి రాజేశ్వరి అనే గర్భిణి ప్రసవం కోసం ఆస్పత్రికి రాగా చివ రి సమయంలో ఆమెను రిఫర్ చేయడంతో పాటు వైద్యం చేయకుండా నిర్లక్ష్యం చేయడం కారణంగా శిశువు మృతి చెందడంతో మండిపడ్డారు. గర్భిణిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరగవద్దని హెచ్చరించారు.

బంగారం మరింత ప్రియం!

- 10 గ్రాములకు రూ. 57,500

సాక్షి, కామారెడ్డి: బంగారం ధరలు రోజుకో రికార్డు సృష్టిస్తోంది. గురువారం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ. 57,500లకు చేరింది. నెల రోజులుగా బంగారం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ధరలు మరింత పెరగవచ్చని బులియన్ వ్యాపారులు అంటున్నారు. పెరుగుతున్న ధరలతో బంగారం అమ్మకాలు నిలిచిపోయాయని తెలిపారు. పెళ్లి నిశ్చితార్థాలు అయిన వారు తప్పనిసరి పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేస్తున్నారు తప్ప సాధారణంగా కొనుగోళ్లకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఏదిఏమైనా పెరిగిన బంగారం ధరలు సామాన్యులకు భారంగా మారనున్నాయి.

మానసకు దాతల చేయూత

- అండగా ఉంటామని భరోసా
- కదిలించిన 'సాక్షి' కథనం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, కామారెడ్డి: 'చిన్న వయసులో పెద్ద కష్టం ' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం పలువురిని కదిలించింది. పలువురు దాతలు తోచిన సాయం అందించి మానసకు భరోసా ఇచ్చారు. చంచల్‌గూడ జైల్ సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ రూ.10వేలు మానస బ్యాంకు ఖాతాకు పంపించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సిరిసిల్లాకు చెందిన శ్రీరాం దుర్గాప్రసాద్ రూ.10 వేలు, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కామారెడ్డికి చెందిన రాము రూ.5 వేలు, ట్రాన్స్‌కోలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కామారెడ్డికి చెందిన పప్పుల ప్రవీణ్ రూ.2వేలు, వేముల వాడకు చెందిన లక్ష్మన్‌కుమార్ రూ.వెయ్యి మానసకు పంపించారు. మరికొందరు దాతలు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఇంకొందరు వైద్యం కోసం కావలసిన సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మానస దాతలకు, 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపింది.

సలాక చోరీకి అడ్డువచ్చాడనే వాచ్‌మన్ హత్య



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

- బాన్సువాడ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: బాన్సువాడ పట్టణంలో ఇటీవల జరిగిన వాచ్‌మన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. సలాక చోరీకి అడ్డువచ్చాడనే వాచ్‌మన్‌ను దుండగులు హత్య చేసినట్లు వెల్లడైంది. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన ఎడిగె పోశయ్య(55) బాన్సువాడ తహసీల్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న రెండు ఇళ్ల నిర్మాణాల వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. పని చేసే ప్రదేశంలోనే ఈనెల 12న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హత్య చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సీసీ ఫుటేజీల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించిన బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన కడమంచి హరిపాల్, టక్ మహేందర్‌సింగ్, మడత కిరణ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితులు ముగ్గురూ కలిసి సలాక చోరీ చేసేందుకు ఇంటి నిర్మాణాల దగ్గరకు వెళ్లారు. సలాక చోరీకి యత్నిస్తుండగా వాచ్‌మన్ పోశయ్య గమనించి వారిని ప్రశ్నించాడు. దొంగతనం బయటపడుతుందని నిందితులు పోశయ్యను కొట్టి, హత్య చేశారు. ఆ తర్వాత సలాక చోరీ చేసి ఉడాయించారు. బుధవారం సలాకను అమ్మడానికి నిందితులు పాత వీక్లీ మార్కెట్ ప్రాంతంలోకి వచ్చారు. అదే సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది, సతీష్, ఓంకార్, శ్రీనివాస్, గంగారాం, వస్సీ, గంగాధర్, మోహన్‌బాబు, సుభాష్‌లను అభినందించారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

మాచారెడ్డి: మండలంలోని పాల్వంచ గ్రామంలో ఓ యువకుడు కుటుంబ కలహాలు, అప్పులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్(34) పొలం వద్ద బోర్లు వేసి అప్పులపాలయ్యాడు. అలాగే ప్రమాదంలో కాలు విరిగి ఇబ్బంది పడుతున్నాడు. అప్పులు పెరిగి కుటుంబ కలహాలకు దారితీశాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రిజ్వాన బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంతోస్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

నందిపేట్(ఆర్మూర్): మండలంలో ఓ వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని సిహెచ్ కొండూరు గ్రామానికి చెందిన చిన్నిగాడు(30) భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగించేవాడు. గత కొంత కాలం అతడు తన భార్యను తీసుకొని నిర్మల్ ప్రాంతంలో నివసిస్తుండగా.. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం తాగిన మైకంలో అతడు భార్యతో గొడవ పెట్టుకుని వెళ్లిపోయాడు. గురువారం నందిపేటలోని పరిగణ చెరువు దగ్గర గల తుమ్మ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని సాలూర గ్రామంలో గల గిద్ద చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ సందీప్ తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వీరయ్య(26) ఈనెల 12న కాలకృత్యాలు తీర్చుకోవడానికి గిద్ద చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం చెరువులో వీరయ్య మృతదేహం లభించగా కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. వీరయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు భార్య శివరాణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

రెండు రోడ్డు ప్రమాదాలు..పదిమందికి గాయాలు





బస్వాపూర్ వద్ద ప్రమాదానికి గురైన కారు.. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయలైనట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్ పట్టణానికి చెందిన సంతోష్ ఆగర్వాల్ తన కుటుంబీకులతో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తుండగా బస్వాపూర్ గ్రామ శివారులో కారు అదుపుతప్పి సర్వీస్ రోడ్డుపై పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సంతోష ఆగర్వాల్, సునీత, పద్మ, లలిత, ప్రథమ్‌లతో పాటు నాలుగేళ్ల కిషన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం క్రిషన్‌ను హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి క్రైం: డ్రైవర్ అజాగ్రత్త కారణంగా గురువారం వేకువజామున ఓ కారు అదుపుతప్పి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగాగల చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని నలుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా... లింగంపేట ప్రాంతానికి చెందిన ప్రైవేటు వైద్యుడు అవినాష్, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, సీఆర్పీ సత్యనారాయణ, ఐలాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్‌లు కారులో కామారెడ్డికి వస్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. ప్రమాదంలో వారందరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకొని, క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు.



చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు

బాలిక అదృశ్యం

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామానికి చెందిన బాలిక సంఘమేశ్వర్‌లోని బంధువుల ఇళ్లల్లో ఉంటూ టైలరింగ్ నేర్చుకుంటుంది. ఈనెల 18న టైలరింగ్‌కు వెళ్లిన సదరు బాలిక తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు వెంటనే యువతి తల్లితండ్రులకు సమచారం ఇచ్చారు. వారు ఎంత వెతికినా బాలిక అచూకీ దొరకలేదు. దీంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

కూతుళ్ల పెళ్లిళ్ల కోసమే దొంగతనం

- అపార్ట్‌మెంట్ వాచ్‌మనే నిందితుడు
- బాన్సువాడలో చోరీ కేసును చేధించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

కామారెడ్డి: బాన్సువాడలోని చైతన్య కాలనీలోగల మధుకుమార్ అపార్ట్‌మెంట్‌లో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు చేధించారు. కూతుళ్ల పెళ్లిళ్ల కోసమే అపార్ట్‌మెంట్ వాచ్‌మనే చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే వ్యాపారి బచ్చు భుజేందర్ ఈనెల 1న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి నిజామాబాద్ వెళ్లాడు. 3న ఇంటికి తిరిగి వచ్చారు. 8న ఇంట్లోని బంగారు ఆభరణాలు కనిపించడం లేదని అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. బంగారు ఆభరణాల దుకాణాల వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. ఈక్రమంలో గురువారం గాంధీచౌక్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు అదే అపార్టమెంట్ వాచ్‌మన్ రాజు విశ్వనాధ్ ఒగ్లేగా గుర్తించారు. మహారాష్ట్రలోని ఖందర్ తాలూకా కౌట గ్రామానికి చెందిన విశ్వనాద్ ఒగ్లేకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె పెళ్లి జరిపించాడు. మిగతా వారికి పెళ్లిళ్లు చేయడానికి తాను చేసే జీతం డబ్బులు సరిపోవడం లేదు. అందుకే దొంగతనం చేశానని నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. అతని వద్ద నుంచి మొత్తం 41తులాల బంగారు ఆభరణాలను, రూ. 15వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ ట్రాన్స్‌పోర్టు షాపులో ఇటీవల జరిగిన చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు గురువారం తెలిపారు. షాపులోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం నిందితుడు మహేష్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. షాపులో రూ.20వేల వరకు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో నగరంలోనే రూ.10లక్షలు చోరీ చేసిన కేసులో మహేష్ నిందితుడని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.